సాక్షి
కామారెడ్డి
సోమవారం । 18 । మార్చి । 2024



ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి

ఓటింగ్ శాతం పెరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు.

- 8లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
35.9 /21.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగవచ్చు.

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రజావాణి రద్దు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ఏదైనా అత్యవసరం ఉంటే కలెక్టరేట్‌లోని 25 వ నంబరు గదిలో ఫిర్యాదులు సమర్పించాలని సూచించారు. ప్రజలు దీన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

కాసుల బాలరాజుకు కార్పొరేషన్ పదవిపై హర్షం



బాన్సువాడ: ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాన్సువాడకు చెందిన కాసుల బాలరాజు నియమితులవడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు ఆదివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాసుల బాలరాజు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి, తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఖలేక్, అంబర్‌సింగ్, మనోహర్, అజీం, శహబ్, మన్నన్, రయిస్, దొంతురాం కాశీరాం, కొట్టం గంగాధర్, దాసరి శ్రీనివాస్, కొండ గంగాధర్, తరుణ్ తదితరులున్నారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

కామారెడ్డి అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకోసం హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ సైకలాజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ కరీం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలంటే భయం, మానసిక ఒత్తిడి, ఆందోళన, ప్రిపరేషన్ లోపాలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, సబ్జెక్ట్‌పై శ్రద్ధ లేకపోవడం, చదివేటప్పుడు నిద్రరావడం, విసుగ్గా ఉండడం తదితర సమస్యలున్నవారు రోజు సాయంత్రం 4 - 8 గంటల వరకు 94404 88571, 040-35717915 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సరస్వతి మాత ఆలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్‌లోని సరస్వతి మాత ఆలయాన్ని ఆదివారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆంజనేయ శర్మ, మాజీ సర్పంచ్ సిద్దాగౌడ్, నాయకులు పార్శి విఠల్ పటేల్, రోండ్ల నారాయణరెడ్డి, మహేష్, ధనుంజయ్ రెడ్డి, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల భయంతో ఆత్మహత్యాయత్నం!

బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు యత్నించింది. వార్షిక పరీక్షలు సమీపించడంతో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో ఆదివారం పాఠశాల భవనంపై నుంచి దూకింది. దీనిని గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. కుడి భుజం ఎముక విరిగినట్లు గుర్తించిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. విద్యార్థిని అక్కడికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై గురుకుల ప్రిన్సిపల్ పద్మకుమారి వివరణ కోరగా విద్యార్థిని నెలరోజుల నుంచి పాఠశాలకు రావడం లేదన్నారు. శనివారమే వచ్చిందని, పరీక్షలంటే భయంతో ఇలా చేసినట్లు విద్యార్థిని చెప్పిందన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలలో ఒంటిపూట

నిజామాబాద్‌నాగారం: వేసవి నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి మే 31 వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట నడవనున్నాయి.

'అకాల' నష్టం

- చేతికందే దశలో దెబ్బతీసిన వరుణుడు
- ఈదురు గాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు
- 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు
- ఆదుకోవాలంటున్న రైతాంగం

జిల్లాలో పంట నష్టం వివరాలు..

పంట	నష్టపోయిన రైతులు	ఎకరాలు
వరి	12,373	16,298
మక్క	1,673	2,784.16
జొన్న	362	705.2
గోధుమ	03	05
ఉల్లి	08	12
బొప్పాయి	07	10
పొగాకు	09	20
మామిడి	76	192
కూరగాయలు	42	45
	14,553	20,071.36



అంతంపల్లిలో నేలకొరిగిన మక్కపంట

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం : దంచికొడుతున్న ఎండలతో భూగర్భ జలమట్టం పడిపోయి పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్న సమయంలో ప్రకృతి సృష్టించిన బీభత్సం కోలుకోలేకుండా చేసింది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 20 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అయితే అంతకు రెట్టింపే పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది.

జిల్లాలో శనివారం సాయంత్రం మొదలైన వడగళ్లు, ఈదురుగాలుల వాన రాత్రి వరకు కొనసాగింది. జిల్లా అంతటా రైతులను ఆగం జేసింది. ఒక్కసారిగా కురిసిన రాళ్ల వానతో రైతులు హతాశయులయ్యారు. ఈదురు గాలులు మరింత దెబ్బతీశాయి. వరి, మక్క, జొన్న, మామిడి, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి పంట చేతికందే సమయంలో కురిసిన రాళ్ల వానతో వరిగింజలు నేలపాలయ్యాయి. చాలా గ్రామాల్లో గింజలన్నీ రాలిపోయి వరిగడ్డి మిగిలింది. కొన్నిచోట్ల వరి పంట నేలవాలిపోయింది. కామారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, రాజంపేట, తాడ్వాయి, గాంధారి, లింగంపేట, రామారెడ్డి, పల్వంచ, మాచారెడ్డి, సదాశివనగర్ తదితర మండలాల్లో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో 15 మండలాల పరిధిలోని 130 గ్రామాల్లో వడగళ్లు, ఈదురు గాలులతో 14,553 మంది రైతులకు సంబంధించి 20,071 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడి గ్రామంలో రేకులషెడ్డు కూలిపోవడంతో రెండు గేదెలు, ఒక ఆవు మృతిచెందాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న పంటల పరిశీలన

జిల్లాలో దెబ్బతిన్న పంటలను ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పలు గ్రామాలలో పర్యటించి పంటనష్టం వివరాలు తెలుసుకున్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బాన్సువాడ నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలను ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పలు ప్రాంతాలలో స్థానిక నేతలు పంటలను పరిశీలించి, నష్టాన్ని తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



దోమకొండ-గొట్టిముక్కుల మార్గంలో కూలిన చెట్టు



తాడ్వాయి శివారులో కూలిన విద్యుత్ స్తంభం



బ్రహ్మాజీవాడిలో మృతిచెందిన ఆవులు, దూడ



కిష్టాపూర్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం



తలమడ్లలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



గొట్టిముక్కులలో మక్కను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ,



అంతంపల్లిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్..

కాంగ్రెస్‌లో నామినేటెడ్ జోష్

- ఉమ్మడి జిల్లాలో నలుగురు నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు
- ఎన్నికల నగారా మోగిన రోజే నియామకం
- బాల్కొండ నియోజకవర్గం నుంచే ముగ్గురికి అవకాశం
- బాన్సువాడనుంచి ఒకరికి..



మానాల మోహన్‌రెడ్డి



సుంకెట అన్వేష్‌రెడ్డి



ఈరవత్రి అనిల్



కాసుల బాలరాజు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల నగారా మోగిన రోజే ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట అన్వేష్‌రెడ్డికి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవుల్లో నియమితులయ్యారు. వీరు ముగ్గురూ బాల్కొండ నియోజకవర్గానికి చెందినవారే కావడం విశేషం. వీళ్లతో పాటు బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాసుల బాలరాజుకు తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి లభించింది. అయితే తాజాగా ఈ నలుగురికి పదవులు దక్కినప్పటికీ ఇంతకు కొద్దిరోజుల ముందే అర్బన్ నియోజకవర్గానికి చెందిన తాహెర్ బిన్ హందాన్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ పదవిని ప్రభుత్వం కేటాయించింది. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ నాయకత్వం శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించింది. మరోవైపు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి చెందిన షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవి దక్కింది. ఒక ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారు, ఐదు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు కలిపి మొత్తంగా ఏడు పదవులు ఉమ్మడి జిల్లా నాయకులకు దక్కడం విశేషం. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు 98 వరకు ఉన్నాయి.

ఎదురుచూస్తున్న మరికొందరు నాయకులు..

నామినేటెడ్ పదవుల కోసం జిల్లా నుంచి పలువురు సీనియర్ నాయకులు తమవంతుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కొందరికి పదవులు వచ్చినప్పటికీ ఇంకా మరికొందరు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులైన పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, నిజామాబాద్ నగర అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్, మైనారిటీ నాయకుడు సయ్యద్ ఖైసర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. కాగా జిల్లాలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులకు సంబంధించి నుడా చైర్మన్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవులు మాత్రమే భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇంకా మరికొందరికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు దక్కనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాతే మిగిలిన ఆశావహుల ఆశలు నెరవేరనున్నాయి.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- జిల్లాలో 62 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 11,962 మంది విద్యార్థులు



పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభంకానున్నాయి. వచ్చేనెల 2వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షల నిర్వహణ కోసం విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 11,962 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందులో 5,834 మంది బాలురు, 6,128 మంది బాలికలు ఉన్నారు. వీరికోసం జిల్లాలో 62 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు. ఏ కేటగిరీలో 17, బీలో 30, సీలో 15 కేంద్రాలున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం 62 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 62 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 22 మంది కస్టోడియన్స్, 22 మంది జాయింట్ కస్టోడియన్స్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 15 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 660 మంది ఇన్విజిలెటర్లు, 'సి' కేటగిరి సెంటర్‌ల కోసం 15 మంది కస్టోడియన్స్‌ను నియమించారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒక ఏఎన్‌ఎం, కానిస్టేబుల్ అందుబాటులో ఉండనున్నారు.

ఐదు నిమిషాల వరకు అనుమతి..

ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ఈసారి నిమిషం నిబంధనను సడలించారు. పరీక్ష సమయానికి ఐదు నిమిషాల సడలింపు ఇచ్చారు. ఐదు నిమిషాలు దాటితే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు. హాల్ టికెట్, ఓఎంఆర్ షీట్‌లలో ప్రింటింగ్ పొరపాట్లు ఉంటే సంబంధిత ఆధారాలను పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్‌కు, ఇన్విజిలెటర్ల దృష్టికి తీసుకువెళ్లాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రానికి చుట్టుపక్కల 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు మూసి ఉంచాలని పేర్కొన్నారు. హాల్ టికెట్‌ను చూపించి ఆర్టీసీ బస్సులలో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే కంట్రోల్ రూం నంబర్ 90326 95219ను సంప్రదించాలని సూచించారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలి.

– రాజు, డీఈవో, కామారెడ్డి

'కేంద్ర పథకాలను వివరించాలి'



మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

నిజాంసాగర్: బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సూచించారు. ఆదివారం మహమ్మద్‌నగర్, జుక్కల్ మండలాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే జాతీయ రహదారుల విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఎంపీగా గెలిచాక అన్ని వర్గాల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పార్టీ నాయకులు రాములుసేట్, రాజు, నరేశ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రహీనులుగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలి

- కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు సారంగపాణి
- చరిత్రకు ఎర్రతెగులు పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు సారంగపాణి, విజయ సారథి, కందకుర్తి యాదవరావు

నిజామాబాద్ సిటీ: ఎంతో చరిత్ర కలిగిన భారతదేశంలో రాజులు, చక్రవర్తులు, భారతీయులను చరిత్రహీనులుగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి సూచించారు. ఆదివారం ఇతిహాస సంకలన సమితి(ఇందూరు) ఆధ్వర్యంలో 'భారత దేశ చరిత్రలో వక్రీకరణలు- వాస్తవాలు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం, చరిత్రకు ఎర్రతెగులు పుస్తకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారత చరిత్రలో పాఠ్యపుస్తకాల నుంచి మొదలుకొని పత్రికలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కొందరు కుహనా లౌకిక మేధావులు విదేశీ విభజన భావజాలంతో అద్వితీయమైన భారతీయ వాస్తవ చరిత్రను మరుగున పడవేసే ప్రయత్నాన్ని చేశారన్నారు. ఎందరో మహనీయుల జీవిత చరిత్రలను అణగదొక్కే ప్రయత్నం జరిగిందన్నారు. విదేశీ విధ్వంసక చక్రవర్తులను మహోన్నతులుగా చిత్రీకరించే ప్రయత్నాలు ఇప్పటికీ చేస్తున్నారన్నారు. భారతీయులందరూ వాస్తవంతో కూడిన భారత చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. జాగృతి వారపత్రిక పూర్వ సంపాదకులు డాక్టర్ వడ్డీ విజయ సారథి మాట్లాడుతూ కమ్యూనిస్టులు పథకం ప్రకారం భారతీయుల మెదళ్లలోకి విదేశీ విషాన్ని నింపుతూ వచ్చారని పేర్కొన్నారు. చరిత్రకు ఎర్ర తెగులు పుస్తకం ప్రతి భారతీయుడు చదవాలని సూచించారు. ప్రముఖ రచయిత్రి పీఎస్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ ఇందూరు ఎంతో ఆధ్యాత్మిక వైభవం కలిగిన జిల్లా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవరావు, ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, ప్రతినిధులు రాంపల్లి మల్లికార్జున్, చిలుముల మోహన్ దాస్, దర్పస్తు రాధ, భూపతి, రిషి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నారు. నవమి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం శ్రీ లక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పోచారం కుటుంబ సభ్యులు స్వామి కల్యాణంకు హాజరయ్యారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలి



కామారెడ్డి క్రైం: ఓటింగ్ శాతం పెరగడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లు 12 రకాల కార్డులలో దేనినైనా ఉపయోగించుకోవచ్చని సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయవద్దన్నారు. సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలని, దాని ద్వారానే ఎన్నికల ఖర్చులు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, ఖాసీం అలీ, మదన్‌లాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళల అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రం నుంచి ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అశోక్‌నగర్ కాలనీకి చెందిన కాలనీకి చెందిన లక్ష్మీదేవికి ఆమె భర్తతో వారం రోజులుగా గొడవ జరుగుతుండడంతో ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుమార్తె అంజలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

స్నేహితురాలి ఇంటికి వెళ్లి..

నిజామాబాద్‌లోని గంగస్థాన్ ఫేజ్–2కు చెందిన నార్లవారి అశ్విని, ఆమె భర్త విజయ్‌కుమార్ కొంతకాలంగా హైదరాబాద్‌లోని పీర్జాదిగూడలో నివా సం ఉంటున్నారు. వారిద్దరూ గత బుధవారం కా మారెడ్డికి వచ్చారు. కొత్త బస్టాండ్‌లో దిగిన తర్వాత అశోక్‌నగర్ కాలనీలో ఉండే తన స్నేహితురాలు అనురాధతో కలిసి వాళ్ల ఇంటికి వెళ్తానని చెప్పి అశ్విని వెళ్లగా, విజయ్‌కుమార్ నిజామాబాద్ వెళ్లిపోయాడు. తర్వాత ఎన్ని సార్లు ఫోన్ చేసినా కలవలేదు. అశోక్‌నగర్‌కు వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. చాలాచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో విజయ్‌కుమార్ ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రామేశ్వర్‌పల్లికి చెందిన మహిళ..

రామేశ్వర్‌పల్లికి చెందిన గంగని అనిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. అనిత పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన స్వామిని ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో ఈ నెల 16న సాయంత్రం ఆస్పత్రికి వెళ్ళి వస్తానని కుమార్తె సాగరికకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె సోదరుడు ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అంతంపల్లిలో పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



జంగంపల్లిలో పంటపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్..



కొల్లూర్‌లో నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు



భిక్కనూరులో బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కడగండ్ల వాన..

- జిల్లావ్యాప్తంగా అపారనష్టం
- పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు, అధికారులు
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు



భిక్కనూరులోని తిప్పాపూర్‌లో..



పుల్కల్‌లో రాలిపోయిన వడ్లు



తిమ్మక్‌పల్లిలో పంటను పరిశీలిస్తున్న అధికారులు



బీబీపేటలో స్తంభానికి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



శేర్‌ఖాన్‌పల్లిలో నేలకొరిగిన వరి

భిక్కనూరు : మండలంలోని అంతంపల్లిలో అకాల వర్షానికి పంటనష్టం భారీగా ఉందని రూ. 50వేల ఎకరాలకు అందజేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి జిల్లా కలెక్టర్‌కు రైతులు వినతిపత్రాలు పంపించారు. మండలంలో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన అకాల వర్షాలకు, వడగండ్ల వానకు వరి, సోరకాయ, టమట, వంకాయ, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే పొట్ట దశకు వచ్చిన వరి పంట విత్తులు నేలపై రాలాయి. ఏవో రాధ ఆధ్వర్యంలో ఏఈవోలు పంట నష్టాన్ని నమోదు చేసుకుంటున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి చేతికి వచ్చిన పంటలు నేల కొరిగాయి. తాడ్వాయితో పాటు, బ్రహ్మాజివాడి, ఎర్రాపహాడ్, చిట్యాల, సంతాయి పేట్, క్రిష్టాజివాడి, బ్రాహ్మణపల్లి, నందివాడ తదితర గ్రామ శివార్లలో దాదాపు 200 ఎకరాల్లో వేసిన మొక్కజొన్న, గోధుమ, మిరప పంటలు నేల కొరిగాయి. 250వరకు స్తంభాలు నేలకొరిగాయి. బ్రహ్మాజివాడి శివారులోవెంకటేశ్వర సామిల్ ధ్వంసమైంది.

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని మండలంలోని హజ్గుల్, పుల్కల్, శెట్లూర్, ఖద్గాంలో పొట్టదశలో ఉన్న వరి గింజలు పూర్తిగా రాలిపోయాయి. తంబాకు పంటకు సాగుకోసం ఎకరానికి రూ. 40 వేలు ఖర్చయ్యాయని రైతులు పేర్కొన్నారు.

బాన్సువాడ : శనివారం రాత్రి బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లో కురిసిన వడగళ్ల వర్షానికి పంటలు నేలకొరిగాయి. మండలంలో వడగళ్ల వర్షంకు 400 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. బాన్సువాడ, చింతల్‌నాగారం, సోమేశ్వర్, తాడ్కోల్ శివారు ప్రాంతాల్లో ఎక్కువగా వడగళ్లు పడ్డాయి. బీర్కూర్ మండలంలోని బీర్కూర్, కిష్టాపూర్‌లో వడగళ్ల వర్షానికి ధాన్యం నేలరాలాయి. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు.



ఇస్సానగర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట

భిక్కనూరు : అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి ఆదివారం పరిశీలించారు. మండలంలోని జంగంపల్లి, అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, బంజర్ల గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులను ఓదార్చారు. బంజర్లకు బైక్‌పై వెళ్లి పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు రమేష్, నర్సింలు, నరేందర్‌రెడ్డి,రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీబీపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రాత్రి కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులతో అపార నష్టం జరిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేశారు.

బాన్సువాడ : వడగళ్ల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీర్కూర్‌లోని కిష్టాపూర్ శివారులో పంటలను పరిశీలించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు.

దోమకొండ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. దోమకొండ నుంచి ముత్యంపేట నుంచి వెళ్లే దారిలో చెట్లు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దోమకొండ నుంచి భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా, సంఘమేశ్వర్, కాచాపూర్ గ్రామాల మధ్య రోడ్లపై చెట్లు కూలిపోగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కామారెడ్డి రూరల్ : మండలంలోని నరసన్నపల్లి, కొటాల్‌పల్లి, లింగాయపల్లి, తిమ్మక్ పల్లి, చిన్న మల్లారెడ్డి తదితర గ్రామాల్లో రాళ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి.

భిక్కనూరు : అకాల వర్షానికి వడగండ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు అధైర్యపడొద్దని అండగా ఉంటానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఆయన ఆదివారం భిక్కనూరు మండలం జంగంపల్లి, అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో పంటనష్టపోయిన రైతులను పరామర్శించి ఓదార్చారు. రెవెన్యూ అధికారులకు పంటనష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించామని, సీఎంకు జిల్లా పంట నష్టాన్ని నేరుగా తెలియజేస్తానన్నారు. ఎంపీపీ గాలిరెడ్డి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి తదితరులున్నారు. మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో వర్షానికి ఇంటి రేకులు ఎగిరిపోయిన బాధితుడు మందాపూర్ నవీన్‌కు రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు.

రైతులను ఆదుకుంటాం

రాజంపేట/దోమకొండ : రాజంపేట దోమకొండ మండలాల్లోని ఆరెపల్లి, తలమడ్ల, రాజంపేట గ్రామాల్లోని పంటలను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పరిశీలించారు. అకాల వర్షానికి మొక్కజొన్న, వరి, చెరుకు పంటలు పూర్తి స్థాయిలో నష్టపోయినట్లు గుర్తించామన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాలకు పైగా పంటనష్ట వాటినట్లు వ్యవసాయాధికారులు అంచనావేసినట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌రావ్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు యాదవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు రామస్వామిగౌడ్, సీతారం మధు, నత్తి సంజీవ్, మడతల సత్యనారాయణ తది తరులు ఉన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం, నస్రుల్లాబాద్, నాచుపల్లి, మిర్జాపూర్, బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు పంట నేల వాలింది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా కురిసిన అత్యధిక వర్షాల్లో నస్రుల్లాబాద్ 18.5మి.మీ వర్షం కురువగా బొమ్మన్‌దేవ్ పల్లిలో 15.5 మి.మీ వర్షం కురిసింది. దీంతో పంటలన్నీ నేలవాలాయి. వ్యవసాయాధికారులు తమవైపు రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి జొన్న, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. శేర్‌ఖాన్‌పల్లి శివారు లోని సాగు చేసిన జొన్న పంట పూర్తిగా నెలవాలిందని రైతులు తెలిపారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన భారీ వడగండ్ల వర్షంతో పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సుల్తాన్‌పేట్, లచ్చన్, మద్నూర్, మేనూర్, రూసేగావ్ తదితర గ్రామాల్లోని వరి, జొన్న, పొద్దుతిరుగుడు పంటలకు నష్టం కలిగిందని రైతులు వాపోయారు.

బాన్సువాడ రూరల్ : మండలంలోని అటవీ ప్రాంత గ్రామాలైన హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్, అనుబంధ తండాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట ఆదివారం కురిసిన అకాలవర్షంతో నేల కొరిగింది. తమకు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. బాన్సువాడ మండలంలోని , రాంపూర్, కొల్లూర్, నాగారం తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఆదివారం మండల వ్యవసాయ అధికారి సుధాకర్, ఏఈఓలు పరిశీలించారు. మండలంలో 37ఎకరాల్లో జొన్న, 60ఎకరాల్లో మొక్కజొన్న, 253ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.



మైలారంలో నేల వాలిన పంట



హజ్గుల్‌లో రాలిపోయిన పొగాకు



దోమకొండ నుంచి ముత్యంపేట దారిలో కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



దోమకొండ శివారులో నేలకూలిన చెట్లు

రైతులకు రూ. 50 వేల నష్ట పరిహారం ఇవ్వాలి

భిక్కనూరు : అకాల వర్షానికి వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 50 వేల నష్టపరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ డిమాండ్‌చేశారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండలం జంగంపల్లి,అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో పర్యటించి నష్టపోయి న పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఆయన వెంట శ్రీసిద్ధరామేశ్వరాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, రామేశ్వర్‌పల్లి, అంతంపల్లి విండో చైర్మన్లు భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.



రాంపూర్‌లో నేలకొరిగిన వరిపంట

వివరాలు సేకరించేలా చూస్తాం

దోమకొండ/రాజంపేట : దోమొండ రాజంపేట మండలాల్లో దెబ్బతిన్న పంటలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం పరిశీలించారు. శనివారం రాత్రి వడగండ్ల వాన వల్ల మొక్కజోన్న, వరిపంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయన గ్రామంలోని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. అకాల వడగండ్ల వాన వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో అధికారులు పర్యటించి నష్టం వివరాలు సేకరించేలా చూస్తానని వారికి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మద్దురి భూపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు, రైతులు ఉన్నారు.



లచ్చేన్ శివారులో..



నాగారంలో..



బీర్కూర్‌లో పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



తిమ్మక్‌పల్లిలో నేలరాలిన మొక్కజొన్న



బ్రహ్మాజీవాడిలో కూలిన ఇల్లు

రివార్డ్ పాయింట్స్ పేరుతో సైబర్ మోసం

- బ్యాంక్ ఖాతా నుంచి రూ.25వేలు విత్‌డ్రా

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సైబర్ క్రైం కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని రాకాసీపేట్ కాలనీకి చెందిన షేక్ షెహబాజ్ మొబైల్‌కు యోనో ఎస్‌బీఐ రివార్డ్ పాయింట్స్ పేరుతో ఓ వచ్చింది. ఆ మెసెజ్‌లోని లింక్‌ను క్లిక్ చేసిన షెహబాజ్ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఓటీపీ వివరాలు నమోదు చేశాడు. ఆ వెంటనే ఖాతా నుంచి రూ.25,501 విత్‌డ్రా చేసినట్లు మెసెజ్ రావడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

19న వాహనాల వేలం

భీమ్‌గల్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ భీమ్‌గల్ పరిధిలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణు మాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన భీమ్‌గల్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నవీపేట: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేటకు చెందిన కుమ్మరి రాములు(80) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాములు బాసర రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాములు తలకు తీవ్రగాయం కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని తాళం వేసిన ఇంట్లో అర్ధ రాత్రి శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 18వ నంబర్ వీధికి చెందిన శివలింగం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లారు. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని రెండున్నర తులాల బంగారం, రూ.10,500 నగదు, వెండి సామగ్రి, కొత్త చీరలను ఎత్తుకెళ్లారు. ఆధారాలు లభించకూడదనే ఉద్దేశంతో ఇంట్లో కారం చల్లి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. అనుమతుల లేకుండా మంగ మల్లయ్య అనే వ్యక్తి తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఊర చెరువులో రెండు మృతదేహాలు

- మాచారెడ్డిలో కలకలం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మాచారెడ్డి: ప్రమాదవశాత్తు నీటమునిగి ఇద్దరు మృతి చెందగా, ఒకేరోజు చెరువులో రెండు మృతదేహాలు కనిపించడం మాచారెడ్డిలో కలకలం సృష్టించింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రత్నగిరిపల్లికి చెందిన దొంతరవేణి నర్సయ్య(35)ఈనెల 15న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం ఉదయం ఊరచెరువులో నర్సయ్య మృతదేహం కనిపించింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. చెరువులో మరో మహిళ మృతదేహం ఉన్నట్లు ఆదివారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీయించిన పోలీసులు.. మృతురాలు ఎల్లంపేటకు చెందిన మరాఠి లక్ష్మి(38) గా గుర్తించారు. లక్ష్మి కూడా 15వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. వేర్వేరుగా ఇద్దరు బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాగర్ కాలువలో వృద్ధుడి మృతదేహం..

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ శివారులోని నిజాంసాగర్ కాలువలో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బస్వాయిపల్లికి చెందిన మొహమ్మద్ సయ్యద్ (83)గా గుర్తించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జంటహత్యల కేసు నిందితుడి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్మూర్ పట్టణంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ ఏడు నెలల క్రితం పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో తన వియ్యపురాలితోపాటు ఆమె సోదరిని హత్య చేసి బంగారం ఎత్తుకెళ్లాడు. ఈ కేసులో గంగాధర్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపగా, రెండు నెలల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న గంగాధర్ భార్యను తరచూ కొడుతుండడంతో ఆమె భర్తను వదిలివెళ్లిపోయింది. తనకు సంబంధించిన కేసులు, భూమి విషయమై న్యాయ సలహా కోసం ఆదివారం ఆర్మూర్‌కు వచ్చిన గంగాధర్ విద్యానగర్ కాలనీ పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటనాస్థలానికి చేరుకొని విచారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య బండి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

బెల్ట్‌షాపులపై కొరడా



కామారెడ్డి క్రైం/నాగిరెడ్డిపేట/నిజాంసాగర్/ఎల్లారెడ్డి/రాజంపేట/మద్నూర్: బెల్ట్‌షాపులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. కామారెడ్డి పట్టణంతోపాటు ఆయా మండలాల్లో ఆదివారం దాడులు చేసి మద్యం నిల్వలను సీజ్ చేశారు. కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో బెల్ట్‌షాప్‌పై ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, అడ్లూర్, గర్గుల్ గ్రామాల్లో 45.50లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రామన్ తెలిపారు. దాడుల్లో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలం చిన్న ఆత్మకూర్, తాండూర్ గ్రామాల్లో మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మూడు దుకాణాల నుంచి 89బాటిళ్ల మద్యం, బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. మహమ్మద్‌నగర్ మండలం తుంకిపల్లిలో 33లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని బెల్ట్‌షాప్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎల్లారెడ్డి మండలం శివానగర్, రుద్రారం, తిమ్మారెడ్డి గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడి చేసి రూ.15వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. రాజంపేట మండలం కొండాపూర్‌లో 9లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంపత్ తెలిపారు. మద్నూర్ మండలం మేనూర్, మద్నూర్‌లోని బెల్ట్‌షాపులపై దాడి చేసినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్ తెలిపారు.